సంప్రదాయ వ్యవసాయం వైపు రైతుల చూపు

విశాలాంధ్ర-మేడికొండూరు: ప్రస్తుత వ్యవసాయం అనేక ఒడిదుడుకుల నేపధ్యంలో సాంప్రదాయ వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. రసాయన ఎరువుల ధరలు పెరగటంతో పాటు వీటి వాడకం వల్ల అనేక రకాల చీడపీడలు పైరుకు ఆశించి రైతులను నష్టాలకు గురిచేస్తున్నాయి. దీనితో రైతులు సంప్రదాయ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. సాంప్రదాయ ఎరువుల వల్ల పైరు బలంగా పెరగటంతో పాటు మొక్కలు చీడపీడల నుండి తట్టుకుని అధిక దిగుబడులు ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకు రైతులు సంప్రదాయ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై సాంప్రదాయ ఎరువులను ఉత్పత్తుల నుండి తయారుచేసిన వర్మి కంపోస్ట్ లాంటి ఎరువులను రైతులకు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సీఆర్డీఏ పరిధిలో తుళ్ళూరు, మంగళగిరి మండలాల్లోని పేదలందరికీ ఇళ్ళ పథకం క్రింద ఇంటి స్థలాల పంపిణీకి స్థలాలను అభివృద్ధి చేసి, ప్లాట్ల మార్కింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఇంటి పట్టాల పంపిణీకి మే 15 నాటికి పూర్తి అయ్యేలా ప్రణాళిక ప్రకారం సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వి.సి.సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలసి సీఆర్డీఏ పరిధిలో ఏర్పాటు చేసే లే అవుట్ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు నియమించిన ప్రత్యేక అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రత్యేక బృందాల్లోని ఇంజనీరింగ్, సర్వే, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు వేగవంతంగా జరిగేందుకు సౌలభ్యంగా ప్రతి లే అవుట్‌లో పనుల పర్యవేక్షణకు జల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి, ఈఈ స్థాయి ఇంజనీరింగ్ అధికారిని, డిప్యూటీ సర్వేయర్‌తో ప్రత్యేక టీం లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రత్యేక అధికారులు లే అవుట్ లో జంగిల్ క్లియరెన్స్, లెవలింగ్ పూర్తి అయిన వెంటనే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల మార్కింగ్ చేయించి రహదారుల ఏర్పాటుతో పాటు ప్లాట్ మార్కింగ్, స్టోన్ ప్లాంటేషన్ సమాంతరంగా చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై ప్రతిరోజు ప్రత్యేక అధికారులు నివేదిక అందించాలన్నారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ట్రైనీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, మోవిడ వాణి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి గిరిజన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గుంటూరు జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆరుగాలం శ్రమించి పండించిన పంట నేలపాలై రైతులు లబోదిబోమంటున్నా... ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టైనా లేకపోవడం బాధా కరమన్నారు. మిరప, మొక్కజొన్న, వరి, పసుపు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అయినా క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి, మంత్రులు గాని రైతుల్ని కనీసం గిరిజన గ్రామాలకు వెళ్లి పరామర్శించిన దాఖలాలు లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనాలు రూపొందించి అన్నదాతలకు తక్షణమే పరిహారం అందించాలన్నారు. రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు బుద్ధపూర్ణిమ వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి: బుద్ధ పూర్ణిమ వేడుకలను స్థానిక వి.టి.జె.ఎం,ఐవీటీఆర్ డిగ్రీ కళాశా లలోని మురుగుడు హనుమంతరావు కళా ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకుగాను అభ్యుదయ కవి గోలి మధు కన్వీనర్‌గా, అందె వెంకటేశ్వరరావు, రేకా స్వరాజ్యలక్ష్మిలను కో-కన్వీనర్లుగా నియమించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే బుద్ధ పూర్ణిమ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రజాకవి జయరాజ్ హాజరవుతుండగా, వక్తలుగా బుద్ధా ఫౌండేషన్ సంస్థాపకుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, మైండ్ ఫిట్‌నెస్ టీచర్ కట్టా కళాధర్ రెడ్డి, మంగళగిరి బుద్ధవిహార్ కార్యదర్శి పామర్తి రవి, జిల్లా పిరమిడ్ సేవాదళ్ కార్యదర్శి ఆకురాతి శంకరరావు పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు కంచర్ల కాశయ్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో బౌద్ధధర్మం విశిష్టతపై మంగళగిరి బుద్ధవిహార్ సంస్థాపకుడు రేకా కృష్ణార్జునరావు ప్రసంగిస్తారు. ప్రముఖ సాహితీవిమర్శకుడు అబ్దుల్ రజాహుస్సేన్, మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, బౌద్ధాభిమాని తాటిపాముల లక్ష్మీపెరుమాళ్ళు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణ రావు, ప్రగతి నారీ శక్తి సంస్థాపకులు పొట్లూరి దేవి, స్టెప్ రాష్ట్ర ప్రతినిధి పావని ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేస్తారని బుద్ధపూర్ణిమ నిర్వహణ కమిటీ తెలిపింది.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామం నుండి క్రోసూరు వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును రోడ్లు భవనాలు శాఖ పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాడమాడుతుందని కనీసం మలుపుల వద్ద, చిన్న వంతెనల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతులకు సత్వర న్యాయం చేయాలి

విశాలాంధ్ర-క్రోసూరు: అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతన్నలకు సత్వర సహాయాన్ని అందించాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రైతు సంఘ నాయకులు షేక్ పీరావాలి అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో అత్యధికంగా మిరప, వరి పంటను సాగు చేశారని దీనిపై కొంతమంది వ్యవసాయ సంఘం అని చెప్పుకుంటూ సరైన పద్ధతి లేకుండా మోసం చేస్తున్నారని ప్రతి రైతు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో దస్తగిరి, యాకోబు, బోనబోయిన లక్ష్మి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-క్రోసూరు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారడానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయని విశ్రాంత ఉపాధ్యాయురాలు రోశమ్మ అన్నారు. క్రోసూరు మండలంలోని అనంతవరం గ్రామంలో వృద్ధులకు చిన్న చిన్న చిట్కాల ద్వారా యోగాసనములు నేర్పించడము కోసం సుబ్బరాజు ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం స్థానిక రామాలయము వద్ద ఈ కార్యక్రమము నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యంగా పిల్లలు యోగాసనాలు నేర్చుకోవడము ద్వారా ఆరోగ్యవంతమైన సమ సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు.

జగనన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-క్రోసూరు: రాజన్న రాజ్యం కోసం, జగనన్న ఆశయాల కోసం ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని, గడపగడపకు నవరత్న పథకాలను చేర్చడమే ప్రధమ ధ్యేయంగా వినూత్న కార్యక్రమాలను చేపట్టనున్నామని వైయస్సార్ పార్టీ నాయకులు మరియదాసు అన్నారు. నియోజవర్గము మొత్తం ప్రతి గ్రామంలో సైకిల్ యాత్రను త్వరలో ప్రారంభిస్తామని, యువకులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ తీగలపై పాలిథిన్ పట్టాను తొలగించండి

విశాలాంధ్ర-క్రోసూరు: విద్యుత్ అధికారులు అలసత్వానికి, క్రోసూరు, అచ్చంపేట మండల అధికారుల నిర్లక్ష్యానికి విద్యుత్ స్తంభానికి గత నెల రోజులుగా పాలిథిన్ పట్టా వేలాడుతూ ప్రధాన రహదారి ప్రక్కనే గాలి విపరీతంగా ఉండి విద్యుత్ తీగలకు అంటుకుంటే పెద్ద ప్రమాదం సంభవిస్తుంది అనే కనీస ఆలోచన కూడా లేకుండా ఉండటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అమరావతి: చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు నేర్పాలన్న ఆలోచన ఎంతో గొప్పదని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి అన్నారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరావతిలో జరిగిన బాల వికాస కేంద్రం పాఠశాలల వార్షికోత్సవ వేడుకల్లో నంబూరు వసంతకుమారి పాల్గొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార పల్లెల్లో కూడా టీటీడీ శ్వేత ద్వారా అర్చక శిక్షణ ఇవ్వడం చాల గొప్ప విషయమన్నారు. కార్యాక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాలాంధ్ర-అమరావతి: అకాల వర్షాల కారణంగా మిర్చి, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలు తీవ్రంగా నష్టపోయి రైతులు కోలుకోలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని నష్టపోయిన రైతులను యుద్ధప్రాతిపదిక రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పెద్దకూరపాడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అమరావతి మండల పరిధిలోని వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న పొలాలను సందర్శించి నష్టపోయిన రైతులను పరామర్శించారు. తెలుగు రైతు రాష్ట్ర నాయకులు కన్యధార వసంతరావు, తెలుగుదేశం నాయకులు బి వెంకటేశ్వర్లు, పి కోటేశ్వరరావు, దానేలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే దుకాణాలు సీజ్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే షాప్స్ సీజ్ చేయడంతో పాటుగా చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఏటి అగ్రహారం మెయిన్ రోడ్‌లో ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య అధికారుల బృందం వ్యాపార వాణిజ్య సంస్థలను ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నదీ లేనిది, రెన్యువల్, ట్రేడ్ ఫీజులు చెల్లింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డ్రైవ్ లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న మెకానిక్ షాప్‌ను సీజ్, పరిసరాల పరిశుభ్రంగా నిర్వహణ చేయకపోవడం పై కర్రీస్ పాయింట్‌కు రూ.5 వేలు అపరాధ రుసుం విధించి, మరో 5 షాప్స్ కు నోటీసులు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్లు ఆనందకుమార్, సోమ శేఖర్, ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర యువత భవిష్యత్ నిర్వీర్యం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చి యువత భవిష్యత్ నిర్వీర్యం చేశారని జిల్లా టిడిపి అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధమని చెప్పి... అధికారంలోకి రాగానే జగన్ సొంత బ్రాండ్లను ప్రజలకు అమ్మి డబ్బును దోచుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాల విషయంలో సెంట్రల్ నివేదిక ప్రకారం మొదటి స్థానంలో ఉండటం చూస్తే ఆవేదన కలుగుతుందన్నారు. రాష్ట్రంలో పథకాలు పెంచుకుంటూ పోతున్నాము అని చెప్పే ముఖ్యమంత్రి జగన్ గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగాన్ని పెంచుకుంటూ పోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీలు అక్రమాలపై పోరాటాలు చేస్తుంటే... అక్రమ గంజాయి కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమరావతి రాజధానిలో పేదలకు ఇళ్లస్థలాల పేరుతో అమరావతిని మురికివాడలా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో అన్ని రంగాలలో సమన్వయంతో పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. నేడు ఉద్యోగాలు లేవు, పరిశ్రమలు లేవు, యువత భవితను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. చివరకు రాష్ట్రంలోనే కాక దేశంలో కూడా పోలీస్ వ్యవస్థను దిగజార్చారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ ఇంఛార్జి నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులు అక్రమ గంజాయి కేసులలో, మట్కా, గుట్కా, హత్య కేసుల్లో అరెస్ట్ అవడం చూస్తుంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎలావున్నాయో అర్థం అవుతుందన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కిన సీఎం జగన్ యువతని నట్టేట ముంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శేషయ్య, దామచర్ల శ్రీనివాసరావు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న హిందూ ఫార్మసీ కళాశాలలో 'హిందూ ఫార్మసీ కళాశాల జాతీయ సేవా సంస్థ', 'ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గుంటూరు బ్రాంచ్' సంయుక్తంగా గురువారం స్వచ్ఛంధ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 55మంది విద్యార్థినీ, విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని స్పష్టం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుతం తలసీమియా వ్యాధి ఉన్న వారికి, రక్తహీనత ఉన్న వారికి అవసరమైన రక్త నిధులను సేకరించటానికి ఈ రక్తదాన శిబిరం ఎంతో దోహదపడుతోందన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను చైర్మన్ రంగరాజు అభినందించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎస్.మధు సూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.సీతరామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి అధ్యాపకులు, ఎన్‌సీసీ ఏఎన్ఓ లెఫ్టినెంట్ సీహెచ్ అజిత్‌బాబు, రెడ్‌క్రాస్ సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జె.రఘు, ఫీల్డ్ ఆఫీసర్ షేక్.జానీ రసూల్ పాల్గొన్నారు.

శ్రీ వైభవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రారంభం

విశాలాంధ్ర-తెనాలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రివర్యులు మేరుగ నాగార్జున, తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌లు గురువారం బాపట్ల జిల్లా, వేమూరు నియోజక వర్గం, చదలవాడ గ్రామంలో శ్రీ వైభవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఇండస్ట్రీస్ వారు వారి మిల్లులలో ప్రజలకు ఉపయోగంగా ఉండే విధంగా సహకరించాలన్నారు. పరిసర గ్రామాల నుండి వినియోగదారులు మిల్లుకు వస్తారని వారికి అందుబాటు ధరలతో సరుకు అందించాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి ధాన్యం వస్తుందని వాటిని మెరుగైన రీతిలో బియ్యం తయారు చేయటం అవసరమన్నారు. అందులో పనిచేసే కార్మికులకు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, తెనాలి మిల్లు యజమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటన బుధవారం పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇది తెలిసిన సీపీఐ బృందం మాల్యాద్రి, అరుణ్ కుమార్, మరియదాసు, యశ్వంత్, విజయకుమార్, జ్ఞానదీప్, శీనులు పెద్దకకానీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడం జరిగినది. పోలీస్ అధికారులు బాలికను వైద్యం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నిర్లక్ష్యాన్ని సీపీఐ ఖండిస్తూ, దోషిని కఠినంగా శిక్షించాలని మరో సంఘటన చోటు చేసుకోకుండా చూడాలని, కామాంధుడి వలన ఇప్పటికీ ఆ ప్రాంతంలో ముగ్గురు బాలికలు చేరసపడ్డారనీ దోషిని కఠినంగా శిక్షించాలని మాల్యాద్రి డిమాండ్ చేశారు.

భూమిపూజ కార్యక్రమం



విశాలాంధ్ర-తెనాలి: తెనాలి, నాజరుపేటలోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ సమీపంలో శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజయోగ ధ్యానమండలి వారు నిర్మించుకుంటున్న నూతన భవన సముదాయానికి తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ధ్యానమండలి నిర్వాహకులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ప్రతి చిన్నసినిమాను విడుదల చేయాల్సిందే

విశాలాంధ్ర-తెనాలి: దర్శ కుల దినోత్సవం సందర్భంగా ప్రతి చిన్నసినిమా విడుదలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని మా-ఏపి వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. దర్శకుల దినోత్సవం సందర్భంగా స్థానిక మా-ఏపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తే గతంలో ప్రతిరైతుల ఆత్మహత్యల మాదిరిగా విడుదలకు నోచు కోని చిన్న నిర్మాతల పరిస్థితి కూడా అంతేనని, యుద్ధప్రాతిపదికన సినిమా పెద్దలతో వివిధ యూనియన్ నాయకులతో చర్చించి కార్యాచరణ పద్ధతిని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. దేశంలో 3763 సినిమా థియేటర్లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 572 థియేటర్లు ఉన్నప్పటికీ కొందరు పెద్దల చేతుల్లో థియేటర్లు ఉండటం వలన అనేక చిన్న సినిమాలు విడుదలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత శాఖ మంత్రు లను అలాగే ఫిలిమ్ కార్పొరేషన్ ఎండీలతో తాము చర్చిస్తామన్నారు.

తెనాలి తహశీల్దారుకు వినతి పత్రం

విశాలాంధ్ర-తెనాలి: రైతు సమస్యలపై గురువారం మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రైతులతో కలిసి తెనాలి తహశీల్దారు కార్యాలయంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. వర్షాలు అధికంగా కురవడం వలన రైతులు పంటలు నష్టపోయారని, రైతులు దిగాలు పడుతున్నారని కాని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించి ఆ పంటలతో సంతోషంగా గడపాలనే ఆశలతో ఉన్న రైతులకు నిరాశ ఎదురైందని ఆలపాటి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు అధికంగా కురుస్తూ కళ్లాలలోని పంటలు నీటిమయం అయ్యాయని, నేడు పరిపాలిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుందన్నారు. కనీసం ఆ పార్టీ కార్యకర్తలు గాని, నాయకులు గాని, శాసనసభ్యులు గాని పొలాలను పరిశీలించడం కూడా చెయ్యలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఎంతో సేవ చేస్తుందని గొప్పలు చెప్పుకోవడమే గాని ఏ మాత్రం స్పందించడం లేదని అన్నారు. ఇప్పటికైనా వారు పొలాల్లోకి వెళ్ళి పరిశీలించి వెంటనే రైతలను ఆదుకోవాలని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించాలి

విశాలాంధ్ర-ముప్పాళ్ళ: ముప్పాళ్ళ తాహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో తాహసీల్దార్ భవానీ శంకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతుల సమస్యల పట్ల వెంటనే స్పందించాలని వీఆర్వోలను ఆదేశించారు. డి.టి లక్ష్మిప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-ముప్పాళ్ళ: రెండురోజులగా కురుస్తున్న అకాల వర్షానికి ముప్పాళ్ళ మండలంలో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మంగళ, బుధ వారాల్లో కురిసిన వర్షాలకు మిర్చి కల్లాలన్ని జలమయమైనాయి. దీనికి తోడు గురువారం కూడా వర్షం పడటంతో రైతులకు ఏమి చేయాలో పాలు పోవడం లేదు. మిర్చి మూడవ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. లక్షలు ఖర్చు పెట్టి పండించిన పంటలు రంగుమారే అవకాశం ఉండటంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సచివాలయ సేవలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-ముప్పాళ్ళ: ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందించే సేవలను వినియోగించుకోవాలని మండలాధ్యక్షురాలు పద్మాపతి లింగా రెడ్డి పేర్కొన్నారు. సచివాలయాల్లో జరుగుతున్న సేవలపై ప్రజలు తెలుసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించాలని అన్నారు.

నాడు నేడు పనుల పరిశీలన

విశాలాంధ్ర-అమరావతి: మండలంలో మంజూరైన నాడు నేడు పాఠశాలను సందర్శించి అక్కడ జరిగిన, జరుగుతున్న పనుల నాణ్యతలను పరిశీలించి పాఠశాలలకు మంజూరైన నిధులకు అనుగుణంగా పనులు మొదలుపెట్టి యుద్ధం ప్రాతిపదికపైన పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయాలని యం.ఇ.ఒ శ్రీనివాసరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తనిఖీల్లో భాగంగా గురువారం లింగాపురం ఉర్దూ పాఠశాలను సందర్శించి పూర్తై, నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ప్రభుత్వం నియమ, నిబంధనలు మేరకే నిర్మాణాలు చేపట్టి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం అంకాలు తదితరులు ఉన్నారు.

పసుపును మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: అకాల వర్షాలకు తడిసిన పసుపును ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి, తడిసిన పసుపు కల్లాలను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పసుపు క్వింటా రూ.6850లకు కొనుగోలు చేయడం లేదని ప్రస్తుతం అకాల వర్షాలతో పసుపు పండించిన రైతులు కల్లాలలో పసుపు తడిసి, అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పసుపు తడవడం వలన తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని అన్నారు. పసుపు రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరకు పసుపును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, డోకిపర్తి రాజేంద్ర బాబు, సూరిశెట్టి వెంకటేశ్వరరావు, ఆదం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

షాదీ తోఫా సాయం హర్షణీయం

విశాలాంధ్ర-దుగ్గిరాల: పేద ఆడబిడ్డల పెళ్లికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ఆర్థిక సాయన్ని ఈ సారి పెళ్లి కూతురు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం స్వాగతిస్తున్నామని వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. గురువారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట్లో ఈ ఆర్థిక సాయన్ని పెళ్లి కూతురు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని, అయితే కొన్ని చోట్ల అత్తింటి వారి జోక్యం, మరికొన్ని సమస్యలు వస్తున్నాయన్నారు. పెళ్లి ఖర్చు సహజంగా తల్లిదండ్రులు పెట్టుకుంటారు. ఆర్థిక సాయం వారికి ఇస్తేనే కాస్త వెసులుబాటు ఉంటుందన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్, షేక్ గఫూర్, షేక్ బాజీ, పఠాన్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

'వేసవి విజ్ఞాన శిబిరాల' బ్రోచర్‌ను ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: స్థానిక అరండల పేటలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు ఆ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరాలకు సంబందించిన బ్రోచర్‌ను అంకిరెడ్డిపాలెం హైస్కూల్లో బత్తుల దేవానంద్‌తో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, ఆర్‌జేడీ సుబ్బారావు, డిప్యూటీ డీఈఓ సుధాకర్ రెడ్డి, కార్పోరేటర్ రమణ, ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ మణికుమార్, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి(ఎఫ్ఏసీ) కె.ఝాన్సీ లక్ష్మీ, సీనియర్ సహాయకులు ఎం.సీతారామయ్య, లైబ్రేరియన్స్ కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, జి.రాజేష్, ఎం.సంజయ్, టి.విజయ్ కుమార్, విశ్రాంతి గ్రంథపాలకులు డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటి, వెంకట రమణ కాలనీ, సంతోష్‌నగర్ 2వ లైను, పామ్ గ్రోవ్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం.402రు కాపురస్తులు **బోరుగడ్డ మనోరంజన్ గారి భార్య కంద్రిక పుణ్య లక్ష్మి (సెల్: 9110332397).** నా పేరిటకు పై తెల్పిన **ఫ్లాట్ నెం.402 ది.20-04-2019న ఉల్లిగడ్డల గోవిందరాజు** గారి నుండి విక్రయ దస్తావేజు **నెం.2946/2019** (నల్లపాడు ఎస్ఆర్ఓ) గా రిజిష్టరు కాబడినది. సదరు ఒరిజినల్ దస్తావేజు మరియు దఖలు దస్తావేజు **నెం.5369/2021** రెండు ఒరిజినల్ దస్తావేజులను **ది.25-04-2023న** ఆర్టీవో ఆఫీసు నుండి అమరావతి రోడ్డులోని చిల్లీస్ హోటల్ వైపు వెళ్లుచుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా పై రెండు దస్తావేజులు దొరికిన యెడల పైన పేర్కొన్న చిరునామాలో తెలియజేయగలరు.

అయోధ్య రామిరెడ్డిని కలిసిన లిప్ క్యాప్ డైరెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఏపీ లిప్ క్యాప్ డైరెక్టర్‌గా కోనేరు సత్యప్రియ ఇటీవల ఎన్నికైయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక బృందావన గార్డెన్స్‌లోని రీజినల్ కోఆర్డినేటర్స్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సత్యప్రియ మాట్లాడుతూ ఏపీ లిప్ క్యాప్ డైరెక్టర్‌గా ఎన్నికకావడానికి సహకారం అందించిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె అయోధ్య రామిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

సంక్షేమం దిశగా రాష్ట్ర పాలన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: అభివృద్ధి-సంక్షేమం ఈ రెండింటిని ప్రాతిపదికగా చేసుకుని సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సుపరిపాలన చేస్తున్నట్లు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న వాష్ రూమ్స్ బ్లాక్‌ను వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి యర్రగుంట్ల శ్రీలక్ష్మి ప్రారంభిం చారు. కార్పొరేటర్లు గోపీ శ్రీనివాస్, ఈచంపాటి వెంకటకృష్ణ, మోతుకూరి వెంకటరత్నం, లాఫింగ్ క్లబ్ ప్రెసిడెంట్ షేక్.లాల్ వజీర్, ఈఈ సుందరరామిరెడ్డి, ఏఈ రాంబాబు, సింగు నరసింహారావు చౌదరి ఉన్నారు.

ఆక్యుప్రెషర్ చికిత్సా శిబిరం

విశాలాంధ్ర-తాడేపల్లి: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16 వరకు ఆరురోజుల పాటు ఆక్యుప్రెషర్, మాగ్నటిక్, వైబ్రేషన్ థెరపీ చికిత్సా శిబిరం ఉండవల్లి సెంటర్లోని వంశీ టాలెంట్స్ స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు చికిత్సాశిబిరం కొనసాగుతుంది. మాగ్నటిక్, వైబ్రేషన్ థెరపీ శిబిరం ద్వారా అధిక బరువు, రక్తపోటు, మోకాళ్ల నెప్పులు, బ్యాక్ పెయిన్, సయాటిక, తలనొప్పి, జాయింట్ పెయిన్, బ్రాంకైటిస్, నిద్రలేమి, కంటి, కీళ్ల నెప్పులు, ఆస్థమా, షార్ట్ స్ట్రక్చర్, చికున్ గున్యా, ఈఎన్‌టి, డయా బెటిస్, ఎసిడిటీ, గర్భాశయ నెప్పి వంటివి తగ్గించు కోవచ్చునని నిర్వాహ కులు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రెసిడెంట్ మున్నంగి వివేకా నందరెడ్డి, సెక్రటరీ కాట్రగడ్డ శివన్నారాయణ, ట్రెజరర్ రామకృష్ణ శెట్టిలను సంప్రదించాలి.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

రాష్ట్రంలో అవినీతి పాలన

విశాలాంధ్ర-మాచవరం: రాష్ట్రంలో అవినీతి పరిపాలన కొనసాగుతుందని గురజాల మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలం లోని గంగిరెడ్డిపాలెంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ మన గురజాల కార్యక్రమాన్ని నిర్వహించారు. యరపతినేని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు వైసీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లుగా అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. టీడీపీ హయంలోనే గంగిరెడ్డిపాలెం గ్రామం బాగా అభివృద్ధి చేశామన్నారు. మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

విశాలాంధ్ర-మాచవరం: మండల కేంద్రమైన మాచవరం వైఎస్ఆర్ క్రాంతి కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దారం అమ్ములమ్మ లక్ష్మిరెడ్డి, జడ్పిటిసి సభ్యులు శివ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా వడ్డీ అమ్మ ఒడి కళ్యాణమస్తు వంటి కార్యక్రమాలను డ్వాక్రా సభ్యులకు తెలియజేయాలని వారు కోరారు. అన్ని గ్రామాల యానిమేటర్లు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి. వారి ఆదేశాల మేరకు ఈ నెల 13న పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సత్య కుమారి పేర్కొన్నారు. పొన్నూరు కోర్టుల ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నందు రాజీపడి తగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చు నన్నారు. కక్షిదారులు వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవలసినదిగా ఆమె కోరారు. వివరాలకు వాట్సాప్ నంబర్ 9492662537 లేదా మెయిల్ ద్వారా సంప్రదించాలన్నారు.

తాగు నీటి పైపులైనుకు మరమ్మతులు

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు పట్టణం లోని రైల్వే స్టేషన్ రోడ్‌లో త్రాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైను పగిలిపోయింది. దీంతో గురువారం పొన్నూరు పట్టణంలోని ఆరు వార్డులు త్రాగునీరు సరఫరా నిలిచిపోయింది. స్పందించిన మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికపై పైపులైను మరమ్మత్తులు చేపట్టారు. మున్సిపల్ ఏఈ హసీనా పనులను పర్యవేక్షించారు.

కన్నుల పండుగగా కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భూసమేత శ్రీరంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా గురువారం భక్తజన రంజకంగా కళ్యాణమహోత్సవం నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభించి, వివిధ పారాయణాలతో ఘనంగా కొనసాగింది.

ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-నాదెండ్ల: నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం గేటు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. హుండీని పగులగొట్టి సుమారు 60వేల నగదును దోచుకెళ్లారు. దేవదాయ శాఖ ఈవో తులసీదాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హౌస్ మ్యాపింగ్‌పై ఇంటిగ్రేటెడ్ శిక్షణ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గురువారం గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన కళ్యాణమండపంలో నియోజకవర్గంలోని మండల, పట్టణ, వార్డు, గ్రామ అధ్యక్షులకు, బూత్ ఇన్చార్జిలకు ఇంఛార్జి టీడీపీ యాప్‌లో నమోదు హౌస్ మ్యాపింగ్ లపై ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై పార్టీ కార్యాలయం నుండి వచ్చిన కుమ్మెత కోటిరెడ్డి, మారెళ్ళ అప్పారావు, రాపర్ల రమేష్ బాబు, రవి నాయక్, గురజాల నియోజకవర్గ ఆర్టీయస్ కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొని అందరికీ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల, పట్టణ, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలకు పరీక్షలు

విశాలాంధ్ర-కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైయస్సార్ కుటుంబ వైద్య విధానాన్ని కొల్లిపర మండలం దంతులూరు గ్రామం అంగన్వాడీ సెంటర్ నందు మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ గర్భిణీ స్త్రీలను, రోగులను పరీక్షించి, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగినది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఆరోగ్య శిబిరమునకు రాలేని వారి ఇంటి దగ్గరకు వెళ్లి పరీక్షించి మందులను ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ దమ్ము ఆశీర్వాదమ్మ, యం.యల్.హెచ్.పి. అత్తోట కవిత, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి అత్తోట స్వరూపరాణి, అంగన్వాడి, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామానికి చెందిన యన గండుల శివరామకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించిన సమాచారం తెలుసుకున్న జనసేనపార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్ గురువారం రూ.15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధితునికి అందచేశారు. అధైర్య పడవద్దని, జనసేనపార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు షేక్ మునీర్ హసన్, యడ్లపాడు ప్రధాన కార్యదర్శి పాపన హనుమంతరావు, ఎనగందుల వీరాంజి, నాని, సీతయ్య, స్టీల్ అంజి, సూర్య, సాయి, వెంకటేష్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల వైయస్సార్ క్రాంతి పదం గ్రామ డ్వాక్రా సంఘాల అసిస్టెంట్స్‌కు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంపీపీ భవనం పద్మలీల పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకే యాప్‌లో మహిళా సంఘాల సభ్యుల లావాదేవీలు వివరాలు చూసుకోవటానికి లోకోస్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ప్రతి వివోఏ సంఘ సభ్యుల వివరాలు పారదర్శకంగా పక్కాగా నమోదు చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఏపీవో గోపి లోకోస్ యాప్ పనిచేయు విధానాన్ని వివోఏ లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవనం మారుతి శేషమాంబ, మండల సమైక్య అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

7న శ్రీలక్ష్మి గణపతి ఆలయం ప్రతిష్ట

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో ఎడ్వర్డ్‌పేట గ్రామంలో ఈ నెల 7న శ్రీలక్ష్మి గణపతి స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఆలయ ప్రతిష్ఠతో పాటు స్వామి వారి కీర్తి ధ్వజ, దేవతా విగ్రహా ప్రతిష్ట జరుగుతుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

పెద్ద పులులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మాచర్ల: నాగార్జునసాగర్ అటవీ ప్రాంత పరిధిలోని మండలాలలో పులి సంచరిస్తున్నట్లు గుర్తించినట్టు పల్నాడు డి.ఎఫ్.ఓ నడపన రామచంద్రారావు అన్నారు. గురువారం ఆయన గురువారం దుర్గి మండలం గజాపురం గ్రామాన్ని సందర్శించారు. అనంతరం డి.ఎఫ్.ఓ రామచంద్రరావు మాట్లాడుతూ గత నెల 26న గజాపురంలో పులి సంచరించటం వాస్తవమేనన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఇప్పటికే 75 పులులు ఉన్నాయని, వాటిలో రెండు పులులు బొల్లాపల్లి, దుర్గి, వెల్దుర్తి మండలాల పరిధిలోని పలు గ్రామాలలో సంచరిస్తున్నట్లు గుర్తించినట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఆ గ్రామాలలో యాంటీ కోచింగ్ స్క్వాడ్ టీం, బేస్ క్యాంపుల ద్వారా ప్రజలకు పులుల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, తద్వారా ఆహారం, మంచినీటి కోసం గ్రామాల్లోకి పెద్ద పులులు సంచరిస్తున్నాయన్నారు. ప్రత్యేక టీముల ద్వారా అటవీ ప్రాంతంలో మంచినీటి తొట్లు, గుంతలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఫారెస్ట్ ను కొన్ని యూనిట్లుగా విభజించి ఆ ప్రాంతాలలో టైగర్ల కదలికలను, సీసీ కెమెరాల ద్వారా గుర్తిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాత్రి సమయాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆవులను అటవీ ప్రాంతంలో వదిలిపెట్టకూడదన్నారు. రాత్రి సమయాలలో ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదని, టైగర్ల ఆనమాలు

కనిపిస్తే ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుజికి షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ రూరల్: మండలంలోని విటంరాజుపల్లి గ్రామంలో జయలక్ష్మి ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి 'మారుతి సుజుకి కార్ షోరూమ్' నూతన ప్రారంభోత్సవం కార్యక్రమం గురువారం జరిగింది. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జివి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని షోరూం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన విటంరాజుపల్లి గ్రామంలో నూతనంగా మారుతి సుజుకి షోరూం ప్రారంభించడం అభినందనీయమన్నారు. దీనివల్ల వినియోగదారులకు సత్వర సేవలు అందడంతో పాటు ,ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా లభ్యమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు నారాయణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-దుర్గి: ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల ప్రజలు పులులు సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్.రామ చంద్రరావు సూచించారు. మండల పరిధిలోని గజాపురం గ్రామంలో గురువారం పులుల సంచారం పై ప్రజలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో సి.సి.కెమెరాల టెక్నాలజీతో 73 పులులు ఉన్నట్లు గుర్తించామన్నారు. రాత్రి వేళ్ళలో పొలాలకు వెళ్ళాలంటే అందరూ కలిసి కట్టుగా వెళ్ళాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆవులు, మేకలు మేపుకునేందుకు అడవిలోకి వెళ్ళద్దన్నారు. బయట మేపుకోవాలని, అడవి నుంచి పులులు బయటికి రాకుండా నీటి సౌకర్యం కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గి సెక్షన్ ఆఫీసర్ కె.వెంకయ్య, కాకిరాల బీట్ ఆఫీసర్ టి.వెంకయ్య, మించాలపాడు ఇన్చార్జ్ బీట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, గజాపురం గ్రామస్తులు ఉన్నారు.

దేవాలయానికి ఆభరణాలు సమర్పించిన ముస్లింలు

విశాలాంధ్ర-గురజాల: నగర పంచాయతీ గురజాలలోని జంగమహేశ్వ రపురం నందు గత 5రోజుల నుండి జరుగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురజాల పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు నరసింహ స్వామి ఆలయంలో కొలువైయున్న వెంకటేశ్వర స్వామికి సుమారు 6లక్షల విలువ చేసే ఆభరణాలు సమర్పించి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. గురజాల పట్టణంలోని చిన్న మసీదు సెంటర్ నుండి ఊరేగింపుగా ముస్లిం సోదరులు జంగమహేశ్వరపురం నరసింహ స్వామి ఆలయానికి ఆభరణాలు తీసుకువెళ్లి సమర్పించారు. సుమారు 6 లక్షల రూపాయల విరాళాలు సేకరించిన ముస్లిం సోదరులు హిందూ ముస్లిం భాయి భాయి, అన్ని మతాలను మనం గౌరవించాలి, అందరం మతసామరస్యతతో మెలుగుతూ మనమంతా ముందుకు సాగాలని నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని ముస్లిం సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షైక్ హుస్సేన్, షేక్ బడేజాని, షేక్ నాగుల్ మీరా, నాసర్ సైదా, షేక్ వలి, పీర్ అహ్మద్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

విశాలాంధ్ర-మేడికొండూరు: మేడికొండూరు మండలంలో అనేక ప్రాంతాల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లే డొంక రోడ్లు చినుకు పడితే చాలు చిన్న చిన్న గుంటలను తలపించే విధంగా మారుతున్నాయి. వేసవిలోనే కొద్దిపాటి వర్షానికి ఇలాంటి పరిస్థితి ఉంటే వర్షాకాలం ఏ విధంగా డొంకలు ఉన్నాయో ఊహించవచ్చు. ఎన్నో సంవత్సరాల నుండి వ్యవసాయ పొలాలకు వెళ్లే డొంక రోడ్లు మరమ్మత్తులకు నోచుకోక గుంతలు ఏర్పడ్డాయి. దీనితో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే కష్టతరంగా మారుతుంది. పొలాల్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను గ్రామాల్లోకి చేర్చాలన్న, పొలాలకు ఎరువులు తీసుకెళ్లాలన్న గుంతలు పడిన డొంక రోడ్ల నుండి కష్టతరంగా మారుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు తమ వ్యవసాయ పొలాల్లో మిర్చి పంటను గ్రామాల్లోకి చేర్చడం తలకు మించిన భారంగా ఉంది. రైతులు మార్కెట్ యార్డ్‌ల నుంచి వచ్చే నిధులతో వ్యవసాయ పొలాలకు వెళ్లే డొంక రోడ్లకు గ్రావెల్ తోలి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

దాతల సహకారాలతో దేవాలయానికి రంగులు

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు బొందిలి పాలెం గ్రామంలోని శ్రీ అడవి పేరంటాలమ్మ తల్లి దేవాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధిపథంలో తీర్చిదిద్దుతున్నట్లు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాలకు చెందిన దాతల సహకారంతో అడవి పేరంటాలమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలకు రూ.5.10లక్షల ఖర్చుతో నూతనంగా రంగులు వేయించినట్లు తెలిపారు. రంగుల నిమిత్తం మతుకుమల్లి- రూ.1,60,650, బొందిలిపాలెం రూ.1,56,200, శానంపూడి రూ.1,21,800, ముండ్రు వారిపాలెం రూ.37,100, అడవిపాలెం- రూ.30వేలు, గంటవారిపాలెం- రూ.18,200లను విరాళాలుగా సమర్పించారని మొత్తం రూ.5.23,950 విరాళాలు వసూలు కాగా రంగుల నిమిత్తం రూ.5.10 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. దాతలకు చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-గురజాల: శ్రీ భూ సమేత పల్నాటి యాదాద్రి లక్ష్మీనం "సింహస్వామి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు గురువారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఎమ్మెల్యేలు కాసు మహేష్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, చంద్రగిరి ఏసురత్నం, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి అన్ని తానై దగ్గరుండి పర్యవేక్షించారు.

మొర్జంపాడులో 'ఫ్యామిలీ డాక్టర్ వైద్య' శిబిరం

విశాలాంధ్ర-మాచవరం: మండలంలోని మొర్జంపాడు గ్రామాల్లో గురువారం స్థానిక హెల్త్ క్లినిక్‌లో 'ఫ్యామిలీ డాక్టర్ వైద్య 'శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ చక్రవర్తి రోగులకు పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 104 వాహనం ద్వారా ప్రతి ఇంటికి తిరుగుతూ వైద్య సేవలు కొనసాగించారు. ఈ వైద్య శిబిరంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారంపై సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే దోమల వ్యాప్తి చెంది మలేరియా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ చక్రవర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బందితో పాటు ఆ గ్రామ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు: వైసీపీ నాయకుడు, పెదకూరపాడు మండల ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అల్లుడు రాయవరపు సాంబశివరావు కుమార్తె శ్రీలత నూతన గృహ ప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ దంపతులను శంకరరావు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈ. సామిరెడ్డి మస్తాన్ షరీఫ్, కంకణాల శివాజీ, నరసింహారావు, రాయవరపు ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడులో వాసవి కన్యకా పరమేశ్వరి త్రిశక్తి పీఠం ఆలయములో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ వత్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం భక్తిశ్రద్ధలతో లలిత సహస్రనామం పారాయణం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించి కన్యకా పరమేశ్వరి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అల్తాఫ్ హుస్సేన్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి అదనపు సిఐగా ఎండి అల్తాఫ్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మేడికొండూరు సిఐగా అల్తాఫ్ హుస్సేన్ విధులు నిర్వహించారు. తాడేపల్లి సిఐగా విధులు నిర్వర్తించిన సిఐ సాంబశివరావు సిఐడికి బదిలీ కాడవంతో ఆ స్థానంలో సిఐ అల్తాఫ్ హుస్సేన్ బాధ్యతలు స్వీకరించారు.

అప్పల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-ఈపూరు: అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నల్గొండ తండాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ తండ గ్రామానికి చెందిన రమేష్ నాయక్ అప్పులు ఎక్కువ అవడంతో భార్యాభర్తల మధ్య మన స్పర్ధలు ఏర్పడి భార్య తన పుట్టింటికి వెళ్లిందని ఒకపక్క అప్పులు అధిక మవడం మరోపక్క భార్య తనను వదిలి పుట్టింటికి వెళ్లడంతో మనోవేదనకు గురైన రమేష్ నాయక్ (33) అగ్నిగుండాల సమీపంలోని నాగార్జునసాగర్ ప్రధాన కుడి కాలవ డీప్ కట్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. జరిగిన సంఘటనపై ఈపూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

టీడీపీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలు మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులకు, కార్యకర్తలకు ఆర్టీఏస్/టెలిగ్రామ్ బాట్/మన టిడిపి యాప్/ ఓటర్ వెరిఫికేషన్/ హౌస్ మ్యాపింగ్ పై ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ టెక్నాలజీని ఉపోయోగించుకోవటంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ముందు ఉంటుంది అని, దీని ద్వారా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఉపయోగపడ్తుంది అని అన్నారు, అలానే తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ప్రతినిధిలు దీనిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్/ యూనిట్ / బూత్ ఇంచార్జిలు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-తాడికొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మోతడక గ్రామంలో గురువారం గడపగడప కార్యక్రమాన్ని కొనసాగించారు. బీసీ కాలనీలో తిరిగారు. కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల వాగ్దానాలను తప్పక అమలు చేసిందన్నారు. గడచిన నాలుగు సంవత్సరాలు కాలంలో 95శాతం హామీలను అమలు చేయటం జరిగిందన్నారు. అభివృద్ధికి మారుపేరు వైసిపి అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు పని కట్టుకొని ప్రభుత్వంపై బురద సల్లుతున్నారని మండిపడ్డారు. గత టిడిపి హయంలో పచ్చ చొక్కా వాళ్లకే పథకాలు దక్కాయని అన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కులమత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి గుడిమెట్ల జ్యోతి, గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, బోయపాటి సాంబశివరావు, వెంకటయ్య మాస్టారు, రాజు, మాధవ్ అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇన్నోవా క్రిస్టా టాప్ గ్రేడ్స్ ధరలను ప్రకటన

గుంటూరు: టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం) తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్ఎక్స్, వీఎక్స్) ధరలను వెల్లడించింది. ఈ వాహనం మెరుగైన ఫ్రంట్ ఫేసియా కలిగి ఉంటుంది. దీనిని కఠినమైన మరియు ధృడమైన ప్రదర్శన కోసం నిర్దిష్టమైన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. తద్వారా భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పొరేట్ అవసరాలు తీరుస్తుంది. ఈ సందర్భంగా టయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడుతూ నూతన ఇన్నోవా క్రిస్టాను 50వేల రూపాయలు చెల్లించి బుక్ చేసుకోవచ్చు. వినియోగదారులు డీలర్ ఔట్‌లెట్లుతో పాటుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని అన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌కు 14వేలమంది అర్హత

గుంటూరు: భారతదేశంలో అగ్రగామి సంస్థగా పేరు తెచ్చుకున్న అన్ అకాడమీ, తాజాగా ప్రకటించిన జేఈఈ అర్హత పరీక్షల్లోనూ సత్తా చాటింది. అన్ అకాడమీలో ఆన్లైన్ ద్వారా శిక్షణ పాఠాలు నేర్చుకున్న దాదాపు 14000 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్, 2023 పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించారు. తద్వారా అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఇక అన్ అకాడమీ ద్వారా పాఠాలు నేర్చుకుని టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఒక్కసారి చూస్తే.. ఇషాన్ ఖండేవాల్, (ఆల్ ఇండియా ర్యాంకు 11), దేషాంక్ ప్రతాప్ సింగ్ (ఆలిండియా ర్యాంకు 12), నిపున్ గోయల్ (ఆలిండియా ర్యాంకు 13) ఉన్నారు. దాదాపు 1450కి పైగా విద్యార్థులు 99 శాతానికి పైగా మార్కులు సాధించారు. 120 మందికి పైగా విద్యార్థులు 99.9 శాతానికి పైగా మార్కులు సాధించారు.

డ్రైనేజ్ సమస్యను వెంటనే పరిష్కరించండి

విశాలాంధ్ర-మార్టూరు: జాతీయ రహదారిపై డ్రైనేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని చీరాల మాజీ ఎమ్మెల్యే పర్చూరు వైసిపి ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అధికారులకు చెప్పారు. మార్టూరు గ్రామంలోని నేషనల్ జాతీయ రహదారికి తూర్పు వైపున ఉన్న హైవే డ్రైనేజి సమస్యలను పరిశీలించి సమస్యల గురించి నేషనల్ హైవే అధికారులు మార్టూరు డిఈ, ఆర్ డబ్యూ జెఈ అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మద్దిసీతాదేవి నగర్‌కి చెందిన డ్రైనేజ్ సమస్యలను పరిశీలించి వెంటనే ఆ సమస్యను పరిష్కరించవలసిందిగా మార్టూరు గ్రామ సర్పంచ్ పంచాయితీ కార్యదర్శికు చెప్పారు. అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. గన్నెపూడి రవి చందు, మార్టూరు మండల కన్వీనర్ పటాన్ కాలేషావలి, జిల్లా వక్ఫ్ బోర్డ్ సెక్రెటరీ గడ్డం మస్తాన్, గ్రామ సర్పంచ్ భర్త భూక్యా రాజా నాయక్, మార్టూరు గ్రామ ఉపసర్పంచ్ కాకోలు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు, కారుచోల సులేమాన్,కొనకంచి మురళీ,ఉలాస గాంధీ వైసీపీ ముఖ్య నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీఆర్ జిల్లా జాయింట్ సెక్రటరీగా నాగయ్య బాధ్యతలు

విశాలాంధ్ర-వేమూరు: సిసిఆర్ జిల్లా జాయింట్ సెక్రటరీగా బొందలపాటి కోటి నాగయ్య బాధ్యతలు స్వీకరించారు. వేమూరు మండలం అబ్బన గుడవల్లి గ్రామానికి చెందిన కోటి నాగయ్య సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సిసిఆర్ సంస్థ మానవ హక్కులకు సంబంధించిన, సమాచార హక్కు చట్టం వంటి కార్యక్రమాల పట్ల ప్రజలకు చైతన్యం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడం కోసంలో బాధ్యతలు తీసుకోవడం కోసం జరిగిందన్నారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్రా స్థాయిలో సమాచార హక్కు సూచన బోర్డులు ప్రతి గవర్నమెంట్ ఆఫీసులో ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సిసిఆర్ సంస్థలో వందలాది మంది సభ్యులు మంచికల్ల అనీల్ కుమార్ అధ్వర్యంలో పని చేస్తున్నారని తెలిపారు. సిసిఆర్ సంస్థలోని ప్రతి సభ్యుడు అవినీతి రహిత సమాజం,మానవహక్కుల కోసం ఒక సైనికుడులా పని చేయడం అందులో నాకు బాపట్ల జిల్లా జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.

వైసీపీని ఆదరించండి

విశాలాంధ్ర-వేమూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో పేదల అభ్యున్నతి కోసం జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆదరించాలని జడ్పిటిసి సభ్యురాలు గాజుల హేమలత విజ్ఞప్తి చేశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండల గ్రామాల్లో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చావలి గ్రామంలో జడ్పిటిసి సభ్యురాలు గాజుల హేమలత ఇంటింటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలన గురించి వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. పేద వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చే విధంగా అన్ని వర్గాలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వేమూరు తదితరు గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం పార్టీ శ్రేణులు వాలంటీర్లు గృహసారథులు పాల్గొని విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలియజేశారు. గృహాలను సందర్శిస్తూ వారి వివరాలు సేకరిస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గురించి వివరిస్తున్నారు. ఆయా కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు గాజులు భాను ప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు కమ్మెల తిరుపతి రాయుడు, విష్ణు మొలకల రామ్మోహన్రావు, గాజుల వెంకటకృష్ణారావు, చావలి హై స్కూల్ చైర్మన్ సోమ రౌతు నారాయణ, తోటకూర సత్యనారాయణ, విష్ణు మొలకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధినేత మెప్పు కోసం చంద్రబాబుపై విమర్శలా..

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: మీ అధినేత జగన్ మెప్పు కోసం మా అధినేత చంద్రబాబుపై విమర్శలు చేస్తారా అని జిల్లా ఇంచార్జ్ మంత్రి కొట్టు సత్యన్నారాయణను టీడీపీ కాపు నేతలు జిట్టా ప్రమీల రాణి, భీమా లీలకృష్ణాలు ప్రశ్నించారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కొట్టు సత్యనారాయణ వాస్తవాలను తెలుసుకోకుండా తెలుగుదేశం పార్టీ మీద, చంద్రబాబు మీద విమర్శలు చేయడం సిగ్గుచేటుచేటన్నారు. కాపు రిజర్వేషన్లు అప్పట్లో వైయస్ రాజశేఖర రెడ్డి వ్యతిరేకిస్తే 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాపుల చిరకాల కోరిక నెరవేరేలా 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం మీకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. నాడు తుని రైలు దహన ఘటనకు ముఖ్య కారణం మీ వైసీపీ పార్టీ కదా రైలు తగులబెట్టిన వారు మీ వైసీపీ నాయకులు కదా మీ రాజకీయ లబ్ది కోసం తెలుగుదేశం పార్టీ మీద నెపం మోపి సంబంధం లేకపోయినా చంద్రబాబుపై నెపం వేస్తున్నారని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వంలో కాపులకు పెద్దపీట వేస్తూ 1.50 కోట్ల మంది కాపులకు అన్నివిధాలా అండగా నిలబడిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మొట్టమొదట కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర విభజన తరువాత ఆర్థిక పరిస్థితి లోటులో ఉన్న సరే రూ. 3100 కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విదేశీ విద్య దీవెన పథకం ద్వారా దాదాపు 5 మంది నిరుపేద కాపు యువత విదేశాల్లో ఉన్నత చదువులు చదువు కోవడానికి ఒక్కొక్కరికి రూ. 15 లక్షల ఆర్థిక సహాయం చేశారని మీ ప్రభుత్వంలో ఎంతమందిని ఇలా పంపించారో చెప్పే దమ్ముందా మీకు ఉందా అని ప్రశ్నించారు. కార్పొరేషన్ ద్వారా కాపులకు స్వయం ఉపాధి కొరకు సబ్సిడీ లోన్‌లు, పనిముట్లు, విద్యార్థులకు హాస్టల్ ఫీజులు, గ్రూప్1 కోచింగ్‌కు ఉచిత శిక్షణ టీడీపీ ఇచ్చిందన్నారు. ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చనిపోయిన 2,23,819 మంది కాపులకు రూ. 2481 కోట్లు ఇచ్చి టీడీపీ అండగా నిలబడిందన్నారు. నేడు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాపు కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి మిగిలి ఉన్న రూ.435 కోట్ల నిధులను వేరే పథకాలకు మళ్లించారన్నారు. ఎన్నికల ప్రచారంలో కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని కార్పొరేషన్ కార్యాలయ బిల్డింగ్‌కు అద్దె కూడా కటకుండా తాళాలు వేశారన్నారు.

మహారాజశ్రీ గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.188/21

బిట్వీన్
రెక్కల హనిమిరెడ్డి - వాది
మరియు
నాగబోయిన శ్రీనివాసరావు - ప్రతివాది
అడ్రసు : నాగబోయిన శ్రీనివాసరావు, తండ్రి నరసింహారావు, 1వ వార్డు, చిన కొడమగుండ్ల (పోస్టు), కారంపూడి మండలం.

పై నెంబరు దావాను ప్రతివాదిపై ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తము దాఖలు చేయగా శ్రీకోర్టువారు ప్రతివాదికి సమన్లు జారీ చేయు నిమిత్తము ది. **12-5-2023**వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదారోజు **ఉదయం గం.10.30ని.లకు** స్వయంగాగాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుసుకొనవలసియున్నది. లేనిచో పరోక్షనందు తీర్మానించబడును.

అచంట శ్రీనివాసరావు,
వాది తరఫు అడ్వకేటు, గురజాల.
సెల్ : 9849031191.

కార్పొరేట్ల సేవలో మోదీ

జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-కారంపూడి: కార్పోరేట్లకు కార్మిక శక్తిని దోచిపెడుతు వారిసేవలో మోధీ తరిస్తున్నాడని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ మారుతి వరప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలో మేడే వారోత్సవాలలో భాగంగా బస్టాండ్ సెంటర్, ఆదినారాయణ కాలనీ స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కార్మిక శక్తి దోపిడితో దేశం పురోగతి సాధించకపోగా, దేశ సంపద పెరగదన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు దోచిపెడుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యతో యువత జీవనోపాధి కోసం వలస పోతున్నారన్నారు. పెరిగిన ధరలతో పేద వర్గాలు అల్లాడిపోతున్నాయన్నారు. పోరాటాల ద్వారా కార్మిక హక్కులను సాధించగలమని అందుకు కార్మికులంతా ఏకం కావాలని ఆయన అన్నారు. మాచర్ల నియోజకవర్గ ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు ఎందరో కార్మికుల ప్రాణ త్యాగ ఫలితమే ఈ ఎర్రజెండా ఆవిష్కరించారన్నారు. ఈ ఎర్రజెండా ఉద్యమ సాధనలో పనిగంటలను, కార్మిక హక్కులను, పనికి తగ్గ వేతనాలను సాధించుకోగలిగామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి కార్మిక, కర్షక, పేద వర్గాలకు ఆమోదయోగ్యమైన పాలనను సాగించాలని ఆయన హితవు పలికారు. మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతు పెట్రోల్, డీజిల్, కరెంట్, బస్సు, నిత్యవసర సరుకుల ధరలను పెంచి పేదవారి నడ్డి విరిచారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులకు వారిచ్చిన హామీలు గుర్తుకు వస్తాయని కంటితుడుపుగా హామీలు అమలుచేసి, గెలిపిస్తే మిగతా వాటిని తీరుస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కార్మికుల శ్రమదోపిడీ నానాటికి పెరిగి పోతుందని, కార్మిక చట్టాలను, కోడ్‌లుగా విభజించి కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్రోహం చేస్తున్నాయన్నారు. కార్మిక, కర్షక, పేద వర్గాలు ఏకమై పోరాటాలు ద్వారా మన హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అరుణపతాక ఆవిష్కరణ అనంతరం పులుహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ నాయకులు ఉలవపూడి రాము, మండల సహాయ కార్యదర్శులు కూరాకుల వెంకటశివయ్య, మేకపోతు చినకోటిరెడ్డి, పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, ఒప్పిచర్ల శాఖ కార్యదర్శి ఇందూరి శ్రీను, సింగరయ్య, మహిళాసమాఖ్య నాయకురాలు నాగమణి, లెనిన్, ఎఐవైఎఫ్ నాయకులు జింకల కోటేశ్వరరావు, వెంకటరమణ, గాలం శ్రీను, సైదాబి, సుభాని, ఎఐటీయుసి నూనె వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

వధువు వరులను ఆశీర్వదించిన ఆమంచి

విశాలాంధ్ర-యద్దనపూడి: మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన ధూళిపాళ్ల శ్రీనివాసరావు కుమారుడు వెంకటేష్ బాబు, భాను శ్రీల వివాహ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని నాయకులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు. గ్రామంలోని అభివృద్ధి పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ్ల వేణు, గన్నవరం చెరుకూరి వేణుబాబు, గన్నవరం గ్రామ ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ కుమార్, ముప్పల రాంబాబు, గోరంట్ల సాంబయ్య, జంపాని కోటి సుబ్బరాయుడు,మారెళ్ళ శ్రీధర్, కోడూరి నాగరాజు, దొడ్డ రవి, సాంబయ్య, పావులూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా

నూతన వధూవరులకు కృష్ణచైతన్య ఆశీర్వాదం

విశాలాంధ్ర-అద్దంకి: స్థానిక మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ గుంటూరు విజయలక్ష్మి,మాధవరావు కుమార్తె సాయి రూపశ్రీ వివాహం గురువారం సింగర కొండలో జరగగా వివాహ వేడుకకు శాప్ నెట్ చైర్మన్ వైసీపీ నియోజకవర్గ ఇన్ చార్జి బాచిన కృష్ణచైతన్య,మాజీ ఎమ్మెల్యే గరటయ్యలు హాజరై నూతన వధూ వరులు సాయి రూపశ్రీ,ధనుష్‌లను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-అద్దంకి: మండలంలోని బొమ్మనంపాడులో గురువారం శ్రీ గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి శిఖర కలశం విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, నియెజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-రేపల్లె: ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ అన్నారు. మండలంలోని పోటు మెరక గ్రామంలో శ్రీ కామాక్షి ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బుడా చైర్మన్ ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీ

విశాలాంధ్ర-రేపల్లె: బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ ఆధారిటీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు నియా మకం హర్షణీయం అని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మల్లికార్జునరావును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బస్టాండ్ సెంటర్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. ప్రమాణస్వీకార మహోత్సవానికి రేపల్లె నుండి సుమారు 100 కార్లతో భారీ ర్యాలీ తో బాపట్లకు చేరుకున్నారు. వైసీపీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోశయ్యకు వైసీపీ అధిష్టానం హామీ

విశాలాంధ్ర-అద్దంకి: వైసీపీ దళిత నాయకుడు అద్దంకి మండలం వేలమూరిపాడు గ్రామానికి చెందిన పాదయాత్ర రోశయ్యగా పిలువబడే జ్యోతి రోశయ్యను బుధవారం వైసీపీ అధిష్టానం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పదవి విషయంలో న్యాయం చేస్తామని రోశయ్యకు హామీ ఇచ్చినట్లు రోశయ్య తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్,జగన్‌తో కలసి ఎనిమిది నెలల పాటు ప్రజా సంకల్పపాదయాత్రలో పాల్గొన్న రోశయ్య పార్టీ అధికారంలోకి రాగానే తనకు ఏఎమ్‌సి పదివి వస్తుందని ఆశించారు. అయితే తొలి విడతలో ఆపదవి బీసి మహిళకు రిజర్వు కావడంతో మిన్నకుండి పోయరు. ఈసారి తన సామాజికవర్గం ఎస్సీకి కేటీయించడంతో పదవిపై ఆశలు పెంచుకున్నారు. ఏఎమ్‌సి పదవిని తనకు కాకుండా శంఖవరప్పాడు గ్రామానికి చెందిన వ్యక్తికి ఇస్తున్నారని మనస్తాపానికి గురైన రోశయ్య గత ఆదివారం అద్దంకి రామనగర్ వద్ద నున్న ఓవర్ హెడ్ ట్యాంకును పురుగు మందు డబ్బాతో ఎక్కి రోశయ్య ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడటంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రోశయ్యను కిందకు దింపారు. విషయం తెలుసుకున్న వైసీపీ అధిష్టానం వైసీపీ రాష్ట్ర నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డి ద్వారా రోశయ్యను బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించుకొని అతనితో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి,ఎమ్ఎల్‌సి లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడారు. పార్టీకోసం మొదటి నుంచి కష్టపడ్డ రోశయ్యకు ఏఎమ్‌సి పదవి విషయంలో న్యాయం చేస్తామని అవసరమైతే సీఎం జగన్‌తో మాట్లాడి స్తామని సజ్జల రోశయ్యకు హామీ ఇచ్చినట్లు రోశయ్య తెలిపారు. పాదయాత్రలో పాల్గొన్న వారికి తగిన గుర్తింపు పార్టీలో ఉంటుందని ఆత్మహత్యా ప్రయత్నాలు మానుకొని ఇక ముందు కూడా ఎప్పటి మాదిరిగానే పార్టీకోసం పనిచేయాలని రోశయ్యకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సూచించినట్లు రోశయ్య తెలియజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యం రావాలి

విశాలాంధ్ర-నిజాంపట్నం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్య తీసుకొచ్చేందుకు సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ప్రచార బేరి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు అన్నారు. రేపల్లె నియోజకవర్గం జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం నిజాంపట్నం మండలం కళ్ళిఫలం గ్రామంలో ప్రచార బేరిని నిర్వహించి ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ వ్యక్తులకు కట్టబెడుతుందని ఆరోపించారు కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలను ఇస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజలపై పన్నుల భారాలను మోపుతుందన్నారు. ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన సాగిస్తున్న బిజెపిని సాగినంపాలని నాగాంజనేయులు పిలుపు నిచ్చారు. సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మన రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ కు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మోడీ అనుసరిస్తున్న విధానాలపై కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని బాలాజీ కోరారు. ఈ కార్యక్రమంలో కళ్ళిఫలం శాఖ కార్యదర్శి నంబూరు సత్యం, సందయ్య, కె. శ్రీనివాసరావు, ఉప్పు దుర్గ, మహాలక్ష్మి, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న నువ్వే మా నమ్మకం

విశాలాంధ్ర-చీరాల: చీరాల నగర్ గ్రామపంచాయతీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి వైసీపీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి స్టిక్కర్స్ అతికించి సంక్షేమ పథకాల గురించి వివరించామని చీరాల మండలవ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు. పృథ్వి ధనంజయ,బిట్టు శ్రీనివాసరావు, ఆసోది అంకాల రెడ్డి, వడ్లమూడి ఆదినారాయణ, కుంచాల రత్నా రెడ్డి, సచివాలయ కన్వీనర్ బక్క చిన్న అద్దంకి రెడ్డి,ముచ్చు దేవేంద్ర, బోయిన బాజీ రెడ్డి, పిట్టు కిషోర్, వైసీపీ నాయకులు కార్యకర్తలు వలంటీర్లు పాల్గొన్నారు.

పసుపు, మొక్కజొన్నలకు మద్దరు ధర ఇవ్వాలి

విశాలాంధ్ర-అద్దంకి: వర్షాలకు తడిసిన పసుపు, మొక్కజొన్న పంటలకు మద్దతు ధరను ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన పసుపు, మొక్కజొన్న కల్లాలను మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే రవికుమార్ రైతులతో కలసి పరిశీలించారు. ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన పంటలు అమ్ముకునేలోపు వర్షాలకు తడిసి నీళ్ళపాలైనాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రైతుల పంటలు కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదేనని ప్రకటించిన జగన్‌రెడ్డి నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి పసుపు,మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-కొల్లూరు: బాపట్ల జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కార్యకర్త ఆయాల నియామకపు కమిటీ వారి అనుమతితో జిల్లా శ్రీ మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారి బాపట్ల జిల్లా వారి ఆదేశానుసారంఅమృతలూరు ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ కొరకు దరఖాస్తులు కోరడమైనది. ఈనెల 5వ తేదీ నుండి 15వ తేదీ వరకుసమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకము అమతులూరు వారి కార్యాలయము నందు స్వయముగా అందజేయవలెనని అమర్తలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ విజయలక్ష్మికోరారు.కొల్లూరు మండల లోఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయాల నియామము కొరకు ప్రకటన జారీ చేసినారుఅంగన్వాడి కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ కొరకు దరఖాస్తులు కోరడమైనది. .కొల్లూరు మండలంలో రాయికంపాడు, కిష్కిందపాలెం, దోనేపూడి అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీలు కలవు కావున అర్హతవున్నవారు దరఖాస్తు చసుకోవాలని ఆమే కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్... వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-అద్దంకి: ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపాలెం కొటికలపూడి గ్రామాల మధ్య గురువారం జరిగింది. కొటికలపూడి గ్రామానికి చెందిన తిప్పా బత్తిన రామాంజనేయులు (16) గురువారం స్వగ్రామం కొటికలపూడి నుంచి ద్విచక్రవాహనంపై తిమ్మారెడ్డిపాలెం పోవుచుండగా మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో రామాంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యులచేత చికిత్స నందించారు. రామాంజనేయులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అతనిని ఒంగోలుకు తరలించారు.

భక్తి శ్రద్ధలతో కట్లమ్మ వార్షిక మహోత్సవాలు

విశాలాంధ్ర-భట్టిప్రోలు: మండలంలోని వెల్లటూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత శ్రీ కట్లమ్మతల్లి 25వ వార్షిక మహోత్సవాలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిత్య పూజలు, మేళతాళాలతో దేవస్థానానికి చేరుకుని చద్ది నైవేద్యములు సమర్పించారు. సాయంత్రం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సామూహిక లక్ష మల్లెల పూజను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పావన నదీ స్నానం, అమ్మవారి గ్రామోత్సవం, విద్యుత్ ప్రభలు, నృత్య గీతాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటి సభ్యులు తెలిపారు.

సచివాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-కర్లపాలెం: ప్రజల సౌఖర్యార్థం ప్రభుత్వం సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయటం హర్షణీయం అని సర్పంచ్ నక్కా లలితకుమారి తెలిపారు. కర్లపాలెం సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. మండలంలోని ప్రజలు ఆధార్‌కి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉన్న, కొత్త ఆధార్ కార్డు అప్లై చేయాలన్న వెంటనే కర్లపాలెం సచివాలయంలోని కేంద్రాన్ని సంప్రదించాలని సర్పంచ్ సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-బల్లికురవ: ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా రావాలని పూర్తి సమాచారంతో సమా వేశానికి హాజరుకావాలని ఆయన తెలిపారు. ఎంపీటీసీలు,సర్పంచులు ఆయా గ్రామాల్లోని ప్రధాన సమస్యలను సమావేశ దృష్టికి తీసుకురావాలన్నారు.

తిమిడిపాడు సచివాలయం సందర్శన

విశాలాంధ్ర-కారంచేడు: తిమిడితపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయంను మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.విజయ లక్ష్మి గురువారం సందర్శించి ఉద్యోగి పనితీరు, సంక్షేమ పథకాలు అమలు పనులు ఎలా జరుగుతున్నాయా అని సిబ్బందని అడిగి తెలుసుకున్నారు. రైతు బరోసా కేంద్రం గ్రామ సచివాలయ బిల్డింగ్స్ నిర్మాణము ఎలా జరుగుతున్నాయా అని పరిశీలించి ఎస్‌డబ్లుపీసీ షెడ్ ని సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

ట్రాఫిక్ సమస్యకు రూరల్ పోలీసులు చెక్

విశాలాంధ్ర-బాపట్ల రూరల్: కర్లపాలెం బాపట్ల మధ్యలో నల్లమడ డ్రైన్ మీద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ వద్ద ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వాహనాలు గంటల తరబడి నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బాపట్ల రూరల్ పోలీసులు బ్రిడ్జి నిర్మాణపని పూర్తి కాకుండానే, అవకాశం ఉన్నమేర తేలికపాటి వాహనాలను బ్రిడ్జి పైనుంచి వెళ్ళడానికి అనుమతించి, వాహనదారుల ఇబ్బందిని కొంతమేర తొలగించారు. దీంతో వాహనదారులు రూరల్ పోలీసులను అభినందిస్తున్నారు.

కమిషనర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-చీరాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలని చీరాల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం చీరాల మున్సిపల్ పరిధిలోని రామ నగర్ ఎస్టీ కాలనీ సచివాలయం-2ను గురువారం మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. సచివాలయంలోని రికార్డులను, హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సచివాలయ అడ్మిన్‌ను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సేవలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం అయన మాట్లాడుతూ స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-కొరిశపాడు: మండలంలోని తిమ్మన పాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం కొరిశపాడు మండలం అభివృద్ధి అధికారి డి సురేష్‌బాబు సందర్శనలో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న దృష్టి పెట్టి లక్ష్యాలను పూర్తి చేయాలి అని సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు పెట్టే పౌష్టికాహారం బాలింతలు గర్భిణీ స్త్రీలకు ఇంటికి వెళ్లి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యకర్తకు ఆయాకు చెప్పారు. కార్యక్రమంలో తిమ్మన పాలెం గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కేంద్రం వర్కర్లు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-వేమూరు: మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన కంటి పరీక్షల శిబిరంలో గుర్తించిన 60 మందికి ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రిలో శుక్లాల శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించారు. వీరికి గేస్ పౌండేషన్ సహకారంతో కళ్లజోలు పంపిణి చేశారు. ఫౌండేషన్ అధినేత కైట్కత్తేపల్లి షాలేము రాజు,సభ్యులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి ఆమంచి హాజరు

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మహారెడ్డి రామారావు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లా శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, ఆకుల హేమంత్, లంకా శివ, జంగా అనిల్, గౌతమ్, కృష్ణం శెట్టి రమేష్, కొక్కిరాల చిన్ని, కాలేషా, మధు, కిరణ్, ఏ సుధాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ శివారెడ్డికి పరామర్శ

విశాలాంధ్ర-కర్లపాలెం: అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న మాజీ జడ్పీటీసీ మరుప్రోలు శివారెడ్డిని వైసీపీ నాయకులు గాదె మధుసుధన్‌రెడ్డి గురువారం పరామర్శించి ఆరోగ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని రాజకీయం అనుభవంతో వైసీపీ బలోపేతానికి కృషి చేయాలని మా వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ఎంపీపీ వనజ, ఇసాక్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన M/s.టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లి. (TCHFL)విజయవాడ బ్రాంచివారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు వద్దకు బాపట్ల జిల్లా, చెరుకుపల్లి(మం), రాజవోలు శివారు, రెడ్లపాలెం కాపురస్తులు దొంతుబోయిన సాంబిరెడ్డిగారి కుమారుడు జయరామిరెడ్డి గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని డిటో గ్రామ కాపురస్తులు దొంతుబోయిన సాంబిరెడ్డి మరియు దొంతుబోయిన గంగాధర్ రెడ్డి గారి వద్ద నుండి ది.21-03-2023న దఖలు దస్తావేజు నెం.655/2023 యస్.ఆర్.ఓ. చెరుకుపల్లి ద్వారా దఖలు పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్న ఆస్తిపై ఋణం కొరకు నాక్లయింటును సంప్రదించియున్నారు. సదరు ఆస్తి దొంతుబోయిన సాంబిరెడ్డిగారికి వారి పూర్వీకుల వల్ల సంక్రమించినదని సదరు ఆస్తికి ఎటువంటి లింకు డాక్యుమెంట్లు లేవని అట్టి ఆస్తిని పై దఖలు దస్తావేజు ద్వారా దొంతుబోయిన జయరామిరెడ్డి గారు దఖలు పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్నానని చెప్పి నాక్లయింటును ఋణం కొరకు సంప్రదించియున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపైగాని, మంజూరుచేయు ఋణముపైగాని ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజులలోపు వ్రాతపూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువు లోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోను మంజూరుచేయబడును మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు:బాపట్ల డి॥, చెరుకుపల్లి సబ్.డి॥ & (మం), రాజవోలు గ్రామ పంచాయితీకి చెందిన రాజవోలు గ్రామ డి.నెం. 283-14, రాజవోలు గ్రామ పంచాయితీ డోర్.నెం.5-1 ఇంటికి సమీపమున గల చ.గ.411-83లు నివేశన స్థలము అందలి నిర్మాణంలో వున్న ఇంటికి హద్దులు. తూర్పు: దొంతుబోయిన శ్రీనివాస రెడ్డి, తండ్రి. రాఘవరెడ్డి గారి స్థలము హద్దు, 116లిం., దక్షిణం: రాజవోలు-అళ్ళవారిపాలెం పోవు రోడ్డుహద్దు, 72లిం., పడమర: పిట్టు శివారెడ్డి గారి స్థలము హద్దు, 122లిం., ఉత్తరం: దొంతుబోయిన శ్రీనివాసరెడ్డి, తండ్రి. రామనాధం రెడ్డి గారి స్థలము హద్దు, 71లిం.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.2, భారతి నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ.సెల్: 9949533987
విజయవాడ, తేది: 04-05-2023

మ్యాటీమోనీ సైట్లతో తస్మాత్ జాగ్రత్త: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా జరిగే ఘరానా మోసాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఒకరి అభిరుచుల స్థాయికి తగినట్లుగా నచ్చిన భాగస్వామిని ఎంచుకునేందుకు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు సరైన వేదికలుగా నిలుస్తున్నాయన్నారు. అయితే లక్షలలో ఒకరిని ఎంచుకొనే సందర్భాలలో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో ఉంచిన ప్రొఫైల్స్ చూసి విదేశీ సంబంధం, లైఫ్ సెటిల్ అయిపోతుందని భావించి కొందరు మహిళలు పరిచయం లేని వ్యక్తులతో పరిచయం పెంచుకొని మోసపోతున్నారన్నారు. ఇలా మోసపోయే వారిలో ఎక్కువ మంది బాగా చదువుకున్న యువతులు, పట్టణాలలో నివాసం ఉండేవారే ఉండటం గమనార్హమన్నారు. ఆన్లైన్ వివాహ పరిచయ వేదికలలో పేరు నమోదు చేసుకున్న మహిళలనే లక్ష్యంగా చేసుకొని మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లలో ఆడపిల్లల తల్లిదండ్రుల బలహీనతలను నేరగాళ్లు తమ పెట్టుబడిగా మార్చుకుంటున్నారన్నారు. విదేశీ సంబంధం అంటూ కొందరు కేటుగాళ్లు నకిలీ ప్రొఫైల్స్ అప్‌లోడ్ చేసి మొదట పరిచయం చేసుకుంటున్నారన్నారు. అనంతరం వివిధ రూపాల్లో దొరికినంత దోచేయడం ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లి చేసుకోవడం, పెళ్లయ్యాక వారి నుంచి నగదు, నగలు వసూలు చేసి పరారవ్వడం ఎక్కువగా జరుగుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా తెలిసే విదేశీ సంబంధాలను ముందు వెనుక చూడకుండా చేసుకుని మోసపోవద్దని పెళ్లి కాకుండా వారితో ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరపడం మంచిది కాదన్నారు. వ్యక్తి గురించి పూర్తిగా విచారించుకొని మ్యాట్రిమోనీ సైట్లో పొందుపరిచిన వివరాల గురించి ఒకటికి రెండు సార్లు విచారించుకోవాలని సూచించారు. అన్ని సరైనవే అని నిర్ధారించుకున్నప్పుడే మాత్రమే పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలపాలన్నారు. ఈ విషయాల్లో ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైన ఈ తరహా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు తెలిపారు.

క్రైస్తవ ఆస్తులపై అధికార పార్టీ నేతల కన్ను

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: బాపట్లలో అధికార పార్టీ ప్రధాన నాయకుడి అండతో కోట్లు విలువ చేసే ఏబీఎం ఆస్తులపై ఇనగలూరి మాల్యాద్రి కన్ను వేశాడని సంస్థ ఆస్తుల సంరక్షణ అధికారి దుడ్డు జాన్ ప్రసన్నకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని ఏబీఎం సంస్థకు సంబందించిన కోట్లు విలువ చేసే ఆస్తులపై ఇనగలూరి మాల్యాద్రి అధికార పార్టీ నాయకునితో తిరుగుతున్నాను అనే అహంకారంతో సంస్థ ఆస్తులపై కన్ను వేశాడని తెలిపారు. మాల్యాద్రి సంస్థ సంఘ సభ్యుడే కాదని ఆస్తుల కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. మాల్యాద్రి పదే పదే ఏబీఎం ఆస్తుల కస్టోడియన్ నేనంటే నేనని భోగస్ మాటలు చెప్పుకుంటూ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాడని మరోసారి అదే పునరావృతం జరిగితే క్రిమినల్ కేసు వేస్తామని సీడీజెడ్ చర్చి కోశాధికారి క్రిస్టఫర్ తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కాలేజీ నందు గురువారం రేపల్లె రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరమును నిర్వహించారు. ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పల్నేని శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించి విద్యార్థినిలను అభినందించారు. జాయింట్ సెక్రెటరీ హరిపద్మ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ దోప్పలపూడి రామ్మోహన్ రావు, జి.దిలీప్ కుమార్, ట్రెజరర్ రామకృష్ణ, ఎన్సిసి అధికారి కెప్టెన్ శ్రీదేవి, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, ఎన్సిసి క్యాడెట్లు , విద్యార్థినిలు పాల్గొన్నారు.